ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేతలు

మేడ్చల్: మున్నూరుకాపు కులంలో వెనుకబడిన వారి అభ్యున్నతికి కృషి చేయాలని మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మండల ఈశ్వరయ్య పటేల్ అన్నారు. మేడ్చల్‌లో ఆదివారం నిర్వహించిన కులసంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులంలో వెనుకబడి ఉన్న వారి పిల్లలకు సంఘం తరుపున ఇప్పటికే నోట్ పుస్తకాలు ప్రతి ఏటా అందజేసుస్తున్నామని అన్నారు. కుల సంఘ సభ్యులు ఐక్యంగా ఉండి ప్రభుత్వం నుండి రావాల్సిన హక్కులను సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు మాజీ సర్పంచ్ ఆకుల సురేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి



కీసర: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ముసుదర్శన్ అన్నారు. ఆదివారం వారంవారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా 105వ వారం కీసర చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో చీర్యాల ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, జ్ఞానమాల సమర్పణ చేసారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయ రెండవ వార్షికోత్సవ ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో మంత్రి మల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన మేడ్చల్ విద్యార్థులు



మేడ్చల్: మేడ్చల్ కు చెందిన యూనివర్సల్ 369 అకాడమికి చెందిన కరాటే విద్యార్థులు నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. పోటీలలో పాల్గొని పలువురు విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరగనున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్వర్ణగిరి, డాక్టర్స్, మన్సాని, వైభవ్, అరుంధతి, శేషాద్రి, పీజీఎస్ కాలనీలు, చౌదరిగూడ గ్రామం, వెంకటసాయి ఫేస్ 1, 2, సాయినగర్, పోచారం గ్రామం, ఇన్ఫోసిస్ కాలనీ, సద్భావన టౌన్‌షిప్‌లోని అన్ని బ్లాకులు, చైతన్యనగర్, అవని వెంచర్, శ్రీనివాస కాలనీ, స్వాతి కన్‌స్ట్రక్షన్స్, అన్నానగర్, సూర్య కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు సంస్కృతి టౌన్‌షిప్‌లోని డీ2, డీ3, డీ4, ఏ24 నుండి 35 వరకు, సీ1, సీ2, సీ3 బ్లాకులకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రెడ్డి ఐక్య వేదిక కార్యాలయం ప్రారంభం

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో సత్యనారాయణపురం కాలనీలో ఏర్పాటుచేసిన రెడ్డి ఐక్య వేదిక కార్యాలయాన్ని ఆదివారం రెడ్డి ఐక్య వేదిక ఫౌండర్ సల్ల చంద్రారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ ఐక్య వేదికతో రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజిడి వెంకట్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జేఎల్ఎస్ నగర్‌కు చెందిన బాలు ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం కింద రూ.10 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో మల్లేష్, బాచి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై వైష్ణోదేవి యాత్ర

మల్కాజిగిరి: మల్కాజిగిరి నుండి జమ్ములోని వైష్ణోదేవి అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి సైకిల్ యాత్రను ఓ భక్తుడు ప్రారంభించాడు. మల్కాజిగిరి గీతానగర్‌కు చెందిన సల్లా శ్రీనివాస్ ఆదివారం తన యాత్రను ప్రారంభించాడు. 2200 కిలోమీటర్ల దూరం చేరుకోవడానికి సుమారు 22 రోజుల సమయం పడుతుందని ఆయన తెలిపారు. గతంలో మహారాష్ట్ర లోని తుల్జాభవానీ మాతను పాదయాత్ర, సైకిల్ యాత్ర ద్వారా వెళ్లి దర్శనం చేసుకున్నానని శ్రీనివాస్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్వాల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం మచ్చబొల్లారం డివిజన్ తోట పెంటారెడ్డి గార్డెన్‌లో ఆరుష్ మెడికల్ మార్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌లు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, నిర్వాహకులు యానందు పండా, సాయినగర్ కాలనీ అధ్యక్షులు ఆర్.కనకయ్య పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట కాలనీల్లో మహనీయుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో మాలధారణ కార్యక్రమం 164వ ఆదివారానికి చేరింది. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లుర్పించారు. కార్యక్రమంలో జంగం అశోక్, శంకర్, గద్ద క్రాంతి కిషోర్ పాల్గొన్నారు.

గట్టుమైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఘట్‌కేసర్: శ్రీ గట్టుమైసమ్మగుట్ట జాతరకు భక్తులు ఆదివారం పోటెత్తారు. నగరం నుండే కాకుండా సరిహద్దు జిల్లాల భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. భక్తులు క్యూలైన్లో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలతో భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బంధు మిత్రులతో కలిసి ఆలయ సమీపంలో షామియానాలు ఏర్పాటు చేసుకొని అమ్మవారి ఆలయానికి బోనాలతో తరలివచ్చారు. డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు జాతరలో ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ఆవహించిన వ్యక్తి భవిష్యవాణి వినిపించారు. ఏసీపీ సందీప్ రావు, సీఐ మహేందర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, సుధీర్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, ఈఓ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.


మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్


గట్టుమైసమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి


అమ్మవారి జాతరలో పోతరాజు, శివసత్తుల విన్యాసం

గౌతంనగర్‌లో పారిశుద్ధ్యంపై సమావేశం


సమస్యలను తెలియచేస్తున్న గౌతంనగర్ కాలనీవాసులు

గౌతంనగర్: గౌతంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అసోసియేషన్ హాలులో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులకు తెలియచేశారు. ఫిబ్రవరి నుండి చెత్త సేకరించేవారికి రూ.130 చెల్లించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారి చిట్టిబాబు, అసోసియేషన్ అధ్యక్షులు కెబి.కిరణ్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి కందిబండ నర్సింహారావు, సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అంజయ్య


పోలేపాకకు నియమకపత్రాన్ని అందజేస్తున్న మందుముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా సీనియర్ నాయకుడు పోలేపాక అంజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. తనపై విశ్వాసంతో పార్టీ అధ్యక్షుడుగా నియమించిన పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

వేడుకగా సాగర్ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవం


వేడుకలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్‌లో సాగర్ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవం వేడుకగా జరిగింది. ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, గొప్ప ఆశయ సాధన కోసం విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏసు బోధనలను అనుసరించాలి


వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సునీతరామయాదవ్, పాస్టర్ విక్టర్ రాజు

గౌతంనగర్: ఏసు బోధనలను అనుసరించాలని కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్‌పేట్ ఆనంద్‌నగర్‌లోని బాప్టిస్టు చర్చి మొదటి వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయిల పట్ల జాలి, అవధులు లేని త్యాగం శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉన్న కరుణామయుడు ఏసు క్రీస్తు అని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ విక్టర్ రాజు, స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కూచిపూడి నాట్య కళాసమితి, కూచిపూడి నాట్య గురువుల బృందం భక్తరామదాసు రచనలకు నృత్య రూపకల్పన ప్రదర్శించారు.

ఘనంగా కిరణ్ ఇంటర్‌నేషనల్ పాఠశాల వార్షికోత్సవం

బోడుప్పల్: బోడుప్పల్ కిరణ్ ఇంటర్‌నేషనల్ పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత, కర్నూల్ జిల్లా ఏఎస్పీ శ్రీమాన్ కృష్ణ కాంత్ పాటిల్ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక క్యార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల వ్యవస్థాపకులు శ్రీమాన్ రితేష్, ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో చేతివాటం

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పంచాయతీ శాఖ టార్గెట్ రూ.26.60 కోట్లు
- గ్రామ పంచాయతీల్లో వసూలైంది రూ.15.48 కోట్లే



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పంచాయతీ శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నుల రూపంలో రూ.26.60 కోట్లు వసూలు చేయాలన్న లక్ష్యంలో ఇప్పటి వరకు రూ.15.48 కోట్లు వసూలైంది. ఇదిలా ఉండగా గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారని ఈ నెల 23న జరిగిన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజమెత్తిన విషయం తెల్సిందే. వాణిజ్య వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి పన్ను మదింపు(ఖరారు)లో స్థానిక గ్రామ కార్యదర్శులు పలువురు ఆమ్యామ్యాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపణలు కూడా చేశారు. భవన సముదాయాల స్థలాన్ని తగ్గించి...పన్నులు ఖరారు చేయటంతో ప్రభుత్వం ఆదాయానికి భారీగా గండిపడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. పంచాయతీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని వారు పేర్కొన్నారు. అయితే ఇదే సమావేశంలో ఉన్న కలెక్టర్ గౌతమ్ మాత్రం పన్నుల ఖరారు, వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవటంతోపాటు జీపీల్లో ఆదాయాన్ని పెంచటం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా దృష్టి పెడుతామని పేర్కొన్నారు. భవనాల నిర్మాణాల అనుమతుల విషయంలో కూడా పంచాయతీ ఉద్యోగులు అవినీతి అక్రమాలకు పాల్పపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించేందుకు కూడా భవనాన్ని బట్టి రూ. 5 వేల నుంచి రూ.20 వేల వరకు ముక్కపిండి వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎక్కువ చేతి వాటం ప్రదర్శించటం ద్వారా పన్ను మదింపులో తేడాలు చూపుతున్నట్లు తెలుస్తోంది.

బకాయిలపై ప్రత్యేక దృష్టి

జిల్లా పంచాయతీ శాఖ నిర్దేశించిన వివిధ పన్నుల టార్గెట్‌లో ఇప్పటి వరకు 62.91 శాతం మాత్రమే వసూలు చేసింది. మిగిలిన పన్నులకు సంబంధించిన రూ.9.12 కోట్లు మార్చి నాటికి వసూలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తోంది. పన్నుల వసూళ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపట్టటం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ శాఖ భావిస్తోంది. మేడ్చల్ జిల్లా పరిధిలోని కీసర మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.3.55 కోట్ల పన్నుల వసూళ్లకు గానూ, ఇప్పటి వరకు 66.04 శాతం పన్నులు వసూలు చేశారు. అలాగే, మేడ్చల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రూ.7.24 కోట్లకు గానూ 65.08 శాతం, ఘట్కేసర్ మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో రూ.7.50 కోట్లకు గానూ, 62.27 శాతం, మూడు చింతలపల్లిమండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో రూ.2.09 కోట్లకు గానూ,69.71 శాతం , శామీర్పేట్ మండలం పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.4.21 కోట్ల పన్నుల వసూళ్లకు గానూ ఇప్పటి వరకు 54.50 శాతం పన్నులను మాత్రమే జిల్లా పంచాయతీ శాఖ వసూలు చేసింది. ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉండటంతో... మిగిలిపోయిన వివిధ పన్నులను ఆయా గ్రామాల్లో కార్యదర్శులు, సిబ్బంది సంయుక్తంగా తగిన కార్యాచరణ ప్రణాళికతో వసూలు చేయాలని నిర్ణయించారు.

గతేడాది లక్ష్యాన్ని చేరలే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గత ఆర్థిక (2022–23) సంవత్సరంలో పన్నుల వసూళ్లలో జిల్లా పంచాయతీ శాఖ లక్ష్యాన్ని అధిగమించలేకపోయింది. జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ పన్నుల వసూళ్ల ద్వారా రూ.22.85 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ, రూ.21.73 కోట్ల వరకు మాత్రమే వసూలు చేయగలిగారు. మిగతా బకాయి పన్ను సొమ్ము రూ.1.14 కోట్లు సకాలంలో వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినా.... గ్రామ కార్యదర్శులు,సిబ్బంది పట్టించుకొనకపోవటంతో లక్ష్యాన్ని చేరుకోలేదని తెలుస్తోంది.

చదువుతో పాటు విలువలు ముఖ్యం

మేడ్చల్: విద్యార్థులకు జీవితంలో చదవులతో పాటు విలువలు ఎంతో ముఖ్యమని సినీ దర్శకుడు ప్రశాంత్ వర్మ అన్నారు. అత్వెల్లిలోని విజ్ఞాన్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చదువులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని అన్నారు. తాను పాఠశాల విద్యా సమయంలో గురువుల నుండి నేర్చుకున్న భారతీయ విలువలు, ప్రసిద్ధ పురాణ పురుషుల కథలే హనుమాన్ సినిమా తీయడానికి ప్రేరేపించాయన్నారు.

కామిడి వీరారెడ్డి సేవలు మరువలేనివి

శామీర్‌పేట్: కామిడి వీరారెడ్డి సేవలు మరువలేనివి ఎంపీపీ హారిక అన్నారు. కామిడి వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా మూడుచింతలపల్లి మండల నాయకులు మూడుచింతలపల్లిలోని ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఎస్‌బీవీఎస్ కళాశాల 23 వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

మున్నూరు కాపులు అంతా ఐక్యతతో ఉండాలి



బోడుప్పల్: మున్నూరు కాపులు అంతా ఐకమత్యంతో ఉండాలని తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం బోడుప్పల్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పల్లవి మోడల్ స్కూల్‌లో పెన్ (పటేల్ ఎంటర్‌ప్యూనర్స్ నెట్ వర్క్) సమావేశాన్ని నిర్వహించారు. మున్నూరు కాపులు అంతా ఒకరికి ఒక్కరూ సహాయ సహకారాలు, చేసుకోవాలని సూచించారు. పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్ పటేల్, గోనే శ్రీనివాస్ పటేల్ ల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.... అల్వాల్ సూర్యనగర్‌లో నివసించే శివప్రసాద్ (25) కారు డ్రైవర్. ప్రైవేట్ బ్యాంకులోలోన్ తీసుకొని కారు నడుపుతున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో కారు లోన్ చెల్లించడంలో ఆలస్యం అయింది. ఫైనాన్స్ వారి నుండి ఒత్తిడి రావడంతో మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. శనివారం అతని భార్యపిల్లలు బంధువుల ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్య ఫోన్ చేస్తే సమాధానం రాకపోవడంతో స్థానిక బంధువులకు ఫోన్ చేసి ఇంటికి పంపించింది. బంధువులు ఇంటికి వెళ్లి చూడగా శివప్రసాద్ మృతిచెంది ఉన్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిరునామా అడిగి చైన్‌స్నాచింగ్

అల్వాల్: ఓ వృద్ధురాలి మెడలో నుండి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ కృపా కాంప్లెక్స్ వద్ద నివసించే విజయలక్ష్మీ (76) ఆదివారం ఉదయం తన ఇంటి ముందు శుభ్రం చేస్తోంది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చిరునామ అడిగారు. ఆమె అతనికి చిరునామా చెబుతుండగా అకస్మాత్తుగా ఆమె మెడలో నుండి 3.5 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లి ఆమెను కింద పడేశారు. దీంతో ఆమె చేతులకు, మోకాళ్లకు తీవ్ర గాయాల్యయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు నాగరాజు రిమాండ్

ఉప్పల్: ఓ వ్యక్తి మృతికి కారణమైన హోంగార్డు నాగరాజును ఉప్పల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ సత్యనగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, హోంగార్డు నాగరాజులు ఇద్దరు పక్క పక్క ఇళ్లలో నివాసం. చిన్న చిన్న విషయాలకు నాగారాజు శ్రీనివాస్‌ను నిత్యం వేధింపులకు గురి చేయడంతో పాటు బెదిరించేవాడు. దీంతో శ్రీనివాస్ తీవ్ర మనస్తాపానికి గురై పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నాగరాజును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ అందజేత



మౌలాలి: వినాయక్‌నగర్‌కు చెందిన మనోజ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.75 వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అతని కుటుంబసభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మనోజ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా రఘువీర్‌రెడ్డి



కుషాయిగూడ: కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా రఘువీర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిభట్ల ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన ఆయనను కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తు రాచకొండ సీపీ ఆదేశాలు జారీచేయడంతో ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తానన్నారు. వాహనదారులు, పాదాచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటానన్నారు.